ఎటుచూసినా చెత్తే..!

కురుమూర్తి జాతరలో లోపించిన పారిశుద్ధ్యం

- ఏర్పాట్లలో అధికారులు విఫలం
- మాంసం దుకాణాల వద్ద దుర్వాసన
- ఇబ్బందుల్లో భక్తజనం


జాతర మైదానంలో రోడ్డుపై పారుతున్న మురుగు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతర పరిసరాల్లో ఎటుచూసినా చెత్తే దర్శనమిస్తోంది. జాతరలో పారిశుధ్య పనులు చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలు, సీఎం రాకను పురస్కరించుకొని అధికారులు హడావుడి చేశారు. ఆయా కార్యక్రమాలు ముగిశాక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

చేతులెత్తేశారు..

జాతరలో పారిశుద్ధ్యంపై అధికారులు చేతులెత్తేశారు. దీంతో రోడ్లపై మురుగునీరు పారుతూ ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. అన్నదానసత్రం వద్ద ఉన్న కొళాయిల నుంచి, పక్కనే ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలల నుంచి దుర్గంధభరిత వాసన వస్తోంది. సబ్‌స్టేషన్ పక్కన ఉన్న కమాన్ సమీపంలో రోడ్డుపై మురుగు పారుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవరిస్తున్నారు. గుట్టపైన స్వామివారి ప్రధాన ఆలయం, ధ్వజస్తంభం కిందిభాగంలో, గుట్టపైనే ఉన్న వాటర్ ట్యాంక్ పక్కన, రాజగోపురం వద్ద చెత్తను అలాగే వదిలేశారు. సత్రాల్లో సైతం సరైన మూత్రశాలలు లేవు. దీంతో జాతరకు వచ్చే భక్తులు, మహిళలు గుట్టపై, చెట్ల పొదల్లోకి వెళ్లాల్సిన దుస్థితి. తగిన ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

మాంసపు వ్యర్థాల..

కురుమూర్తి జాతరలో ఏర్పాటుచేసిన మాంసం దుకాణాల నుంచి భరించలేని దుర్వాసన వస్తోంది. మాంసం విక్రయదారులు మాంసం వ్యర్థాలను, మాంసం శుభ్రం చేసిన నీటిని కాలువలోకి వదిలేశారు. దీంతో జాతరకు వచ్చే భక్తులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి.

చెత్తను సేకరిస్తున్నాం

కురుమూర్తిస్వామి జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం. అక్కడక్కడ చెత్తకుండీలను ఏర్పాటుచేశాం, చెత్తను సేకరిస్తున్నాం. ప్రతిరోజు బ్లీచింగ్ పౌడర్‌ను జాతర మైదానంలో చల్లుతున్నాం. కొన్నిచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేశాం.

– అనిల్‌కుమార్, ఎంపీఓ, చిన్నచింతకుంట


ప్రధాన ఆలయం కింది భాగంలో ఉన్న చెత్తచెదారం


విడిది సత్రాలవద్ద ఉన్న చెత్త

సర్వే పక్కాగా చేయాలి

- ఒక్క ఇంటిని కూడా వదలొద్దు
- కలెక్టర్ విజయేందిర బోయి


దేవరకద్రలో సమగ్ర సర్వేపై ఎన్యుమరేటర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

సాక్షి, నెట్‌వర్క్: ఒక్క ఇంటిని కూడా వదలకుండా సర్వేను పక్కాగా చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. ప్రతి నివాస ప్రాంతంలోని ఇళ్ల జాబితా ప్రకారం ఎన్యుమరేషన్ బ్లాక్‌లో ఏ ఒక్క ఇల్లు మినహాయించ కుండా సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం దేవరకద్ర మండల కేంద్రంలోని 39వ ఎన్యుమరేషన్ బ్లాక్ పరిధిలో సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సర్వే తీరును క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. సర్వే కోసం ఇళ్లకు అతికించిన స్టిక్కర్లపై నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. సర్వే ఫారంలోని ప్రశ్నావళి ప్రకారం నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ప్రతి కుటుంబంలోని పూర్తి సమాచారం సేకరించాలని ఎన్యుమరేటర్‌కు సూచించారు. ఎన్యుమరేటర్లకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ సర్వే ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ చేయాలని సూపర్‌వైజర్లను కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ దీపిక, తదితరులు ఉన్నారు.

ప్రతిరోజు 12ఇళ్లు సర్వే చేయాలి

- ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు 12 ఇళ్లు సర్వే చేయాల్సిందేనని జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం జడ్చర్ల మండలంలోని పోలేపల్లిలో ఆయన ఎన్యుమరేటర్లతో మాట్లాడారు. పాఠశాల విధులు ముగించుకుని మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6గంటల వరకు సర్వే చేయాలన్నారు. ఆయన వెంట సర్వే సూపర్‌వైజర్ మాల్యానాయక్ ఉన్నారు.
- నవాబుపేట మండలంలో సామాజిక సర్వే 4 వేల మార్క్‌ను దాటింది. మొత్తం 4227 ఇండ్లలో సర్వే పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్‌లు తెలిపారు. మొదటిరోజు మాత్రమే 6 వందల వరకు చేసిన సర్వే మరుసటి రోజు నుంచి, రోజుకు వేయికి పైగా సర్వే చేస్తుండటంతో సర్వే ఊపందుకుంది. దీంతో మరో 9వేల ఇండ్లు మాత్రమే సర్వే చేయాల్సి ఉంది. ఎన్యుమరేటర్లు రోజుకు పదికిపైగా ఇండ్లను సర్వే చేస్తుండటంతో రోజుకు వేయికి పైగా సర్వే కొనసాగుతోంది.

నాలుగో రోజు 5,030 ఇళ్ల సర్వే

- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నాలుగో రోజు 5,030 ఇళ్ల వద్దకు 526 మంది ఎన్యుమరేటర్లు వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కొత్తచెరువురోడ్ ప్రాంతంలో సర్వేను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, పీర్లబావి ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఇక మొత్తం 49 వార్డుల పరిధిలో గుర్తించిన 78,696 ఇళ్లకు గాను ఇప్పటివరకు 15,344 ఇళ్ల సర్వే పూర్తి చేశారు.
- సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఎన్యుమరేటర్లు పనిచేయాలని ఎంపీడీఓ కాశప్ప అన్నారు. కోయిల్‌కొండ మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో సర్వేను పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

క్లుప్తంగా

వ్యవసాయ అధికారిగా కిషోర్‌నాయక్

గండీడ్: మండల వ్యవసాయ అధికారిగా రమావత్ కిషోర్‌నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఆయన నల్లగొండ జిల్లా మేములపల్లి మండల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన పనిషా బదిలీపై వెళ్లారు. మండలంలోని రైతులకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా తనను సంప్రదించాలని కోరారు.

కానిస్టేబుల్‌ను అభినందించిన సీఐ

జడ్చర్ల: జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విష్ణుమూర్తిని మంగళవారం స్టేషన్‌లో సీఐ ఆదిరెడ్డి శాలువాతో అభినందించారు. సీఈఐఆర్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేయడంలో కానిస్టేబుల్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో 6వ స్థానం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు దక్కిందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శివానందంగౌడ్, చంద్రమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని



జడ్చర్ల టౌన్: 15వ తేదీ నుంచి ఖమ్మంలో జరగబోయే ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని పెద్ద ఆదిరాల జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని సాత్వికరెడ్డి ఎంపికైనట్లు పీడీ మోయిన్ తెలిపారు. ఈనెల 2న జిల్లాకేంద్రంలో జరిగిన అండర్–14 ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్ విభాగంలో మొదటి స్థానం, 5న జరిగిన ఉమ్మడి జిల్లా టోర్నీలో రాణించి రజత పథకం పొందిందని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికై న సాత్వికరెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

ఉచితంగా రక్తపరీక్షలు



హన్వాడ: మండలంలోని వేపూర్‌లో ఉచితంగా రక్తపరీక్షల కార్యక్రమం నిర్వహించారు. వైఆర్ జీకేర్ సంస్థ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా, 42 మంది స్వచ్ఛందంగా రక్త పరీక్షలు చేయించుకున్నారు. సంస్థ డీఆర్‌బీ శ్రీకాంత్‌రెడ్డి హెచ్‌ఐవీ, ఏయిడ్స్, సుఖవ్యాధులు, టీబీ వంటి తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. 18–60 ఏళ్ల లోపు ఉన్న ప్రతి ఒక్కరు రక్తపరీక్షలు చేయించుకోవాలని, వ్యాధులపై అవగాహన కలిగి, సురక్షితంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఆర్‌బీ సంస్థ జెడ్‌ఎస్పీ–2 కృష్ణ, సీఎల్‌డబ్ల్యూ నగేష్, పద్మ, విజయ పాల్గొన్నారు.

అబ్దుల్ ఖలీక్‌కు డాక్టరేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పోలీస్‌లైన్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మహమ్మద్ అబ్దుల్ ఖలీక్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు ఆయన డాక్టర్ ఎంఎం ముయిద్ జావేద్ పర్యావేక్షణ ‘ఉర్దూ నవలల అభివృద్ధి ఇతర భాషల నుంచి తర్జుమా చేయబడిన నవలల పాత్ర’ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


కొత్తచెరువులో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని కోడూరు గ్రామ చెరువులో ప్రత్యేక పూజలు చేసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సరం మంచి వర్షాలు కురిశాయని, చెరువులన్నీ నిండుకుండలా ఉన్నాయని, ఈ రోజు విడిచే చేపలు మంచి రాబడి ఇవ్వాలని ఆకాంక్షించారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి..

విద్యార్థులు కష్టపడి చదవి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోడూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని తరగతుల్లో డిజిటల్ బోధన తీరును పరిశీలించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన మెటీరియల్స్‌ను పెన్ డ్రైవ్ లో శుక్రవారంలోగా అందిస్తానని, పెన్ డ్రైవ్ లు ఉపయోగించి, డిజిటల్ తరగతులను విద్యార్థులకు బోధించాలని, డిజిటల్ రూపంలో తరగతులను బోధించడం చేత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్‌పీ వెంకటేష్ , జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు గంజి ఆంజనేయులు, సిరాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌పై దృష్టిపెట్టాలి..

మత్స్యకారులు కులవృత్తితో పాటు తమ పిల్లల చదువు, భవిష్యత్‌పై దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని కొత్తచెరువులో చేపపిల్లలను వదిలారు. కులవృత్తి ఒక్కటే ప్రధానం కాదని, తమ పిల్లలను చదివించి మంచి భవిష్యత్‌ను అందించాలన్నారు. మత్స్యకారులు కలిసికట్టుగా ఉండి, కలిసి నిర్ణయం తీసుకోవాలన్నారు.

అధైర్యపడొద్దు–అండగా ఉంటాం


హన్వాడలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ: అధైర్యపడొద్దు.. రైతులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. ఎఫ్‌ఏసీఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇప్పటివరకు వేస్తామన్న రైతు భరోసా డబ్బులు వేయలేదని విమర్శించారు. రైతుల తరఫున ప్రభుత్వంపై తిరుగుబడతామని, రైతులకు అందాల్సిన రైతుబంధు సాయం అందేలా ఉద్యమిస్తామన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బాల్‌రాజు, నాయకులు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జాతరలో నాటకోత్సవం వాల్ పోస్టర్ విడుదల

చిన్నచింతకుంట: భాషా సంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం, కలీమ్ కల్చర్ థియేటర్ వారి ఆధ్వర్యంలో శ్రీ కురుమూర్తిస్వామి జాతరలో రెండు రోజుల పాటు నిర్వహించే నాటక ప్రదర్శన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాటక ప్రదర్శన నిర్వాహకుడు కలీమ్ మాట్లాడుతూ కురుమూర్తి స్వామి జాతరలో ఈనెల 15, 16వ తేదీల్లో ధనం మూలం ఇదం జగత్, శ్రీకృష్ణ రాయభారం నుంచి శయన దృశ్యం వరకు, శ్రీరామంజనేయ యుద్ధ ఘట్టం వంటి నాటక ప్రదర్శన ఇస్తున్నట్లు తెలిపారు. నాటక ప్రదర్శనకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వీక్షించాలని కోరారు.

శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన ‘మహబూబ్‌నగర్ ఫస్ట్’ కార్యక్రమం ద్వారా స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని మహబూబ్‌నగర్ ఫస్ట్‌లో కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులకు 240 మంది విద్యార్థులతో శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చిన్నారెడ్డి సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ ఫస్ట్ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సెట్విన్ సంస్థ సహకారంతో మూడు ట్రేడ్‌లలో 240 మందికి మూడు నెలలపాటు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్నామన్నారు. రాబోయే పదేళ్లలో 20 వేల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చేలా కృషిచేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి కూడా సహాయం ఇచ్చేలా ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మదర్‌మిల్క్ బ్యాంక్


సూపరింటెండెంట్‌కు సంపత్‌కుమార్‌కు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మదర్ మిల్క్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తన చాంబర్‌లో ఆస్పత్రి, సుషేనా హెల్త్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం కుదిరినట్లు (ఎంఓయూ) పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని ద్వారా ధాత్రి మదర్స్‌మిల్స్ బ్యాంక్, కంప్రహెన్సివ్ లాక్టేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను స్థాపించేందుకు చొరవ తీసుకున్నట్లు తెలిపారు. ఈ సహకారం ద్వారా శిశు పాలు (బ్రెస్ట్ మిల్స్) ప్రధానం, నిల్వ చేయడం, లాక్టేషన్ మద్దతు వంటి సేవలు అందించి తల్లులు, శిశువుల ఆరోగ్యం మెరుగుపరచడంతో సహాయపడే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా శిశు పాలు అందుబాటులోకి తీసుకొచ్చి తల్లుల కోసం లాక్టేషన్ సబంధించిన నిపుణుల మద్దతు అందించడం ఏకీకృత ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పీడీయాట్రిక్ విభాగాధిపతి సురేష్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్, సుసే నా హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఉదయ్ శంకర్‌రాజు పాల్గొన్నారు.

న్యూమోనియాతో ప్రాణాలకు ముప్పు

పాలమూరు: న్యుమోనియా సోకి నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పద్మ అన్నారు. మంగళవారం ప్రపంచ న్యూమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎవరైనా న్యుమోనియా బారిన పడవచ్చని, దీనితో పిల్లలు, 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఎక్కువ ప్రమాదం ఉంటుందన్నారు. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకుతుందని, నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. వ్యాధికి గురైన వారు దగ్గు, రక్తంతో కూడిన కఫం, చలి జ్వరం, శ్వాస కోశాల్లో నొప్పి, ఛాతి భాగంలో నొప్పి, తలనొప్పి, ఆక్సిజన్ స్థాయిల్లో హెచ్చుతగ్గులు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. తొలి దశలో ఉన్నప్పుడు గుర్తిస్తే సరైన చికిత్స పొందడానికి వీలుంటుందని చెప్పారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలకార్మిక నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బాలకార్మిక నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కోర్టు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ రఘుపతి అన్నారు. ఈ మేరకు మంగళవారం కేజీబీవీలో బాల కార్మిక నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలలను పనిలో పెట్టుకుంటే చట్ట పరంగా శిక్ష అర్హులన్నారు. కార్యక్రమంలో యోగేశ్వర్‌యాదవ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పట్టుబడినవి రేషన్ బియ్యమే

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన బొలెరో వాహనంలో పోలీసులకు పట్టుబడినవి రేషన్ బియ్యమేనని అధికారులు నిర్ధారించారు. ఈనెల 9న వేముల సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు గట్టు వద్ద బియ్యం లోడుతో ఉన్న బొలేరో వాహనాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాహనాన్ని మూసాపేట ఠాణాకు తీసుకొచ్చి అదే రోజు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారమిచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఠాణాకు వచ్చి వాహనంలో బియ్యాన్ని పరిశీలించి అవి రేషన్ బియ్యమేనని నిర్ధారించారు. వాహనంలో సుమారు 13 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జాతరలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి

చిన్నచింతకుంట: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన కురుమూర్తి స్వామి జాతరలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆర్ శేఖర్ వివరాల ప్రకారం.. కురుమూర్తి స్వామి జాతర మైదానంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, వృద్ధుడు జాతరలో భిక్షాటన చేసుకుంటున్నట్లు తెలిపారు. వృద్ధుడి వివరాలు తెలిసిరాలేదు. వృద్ధుడి మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళకు గాయాలు

మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన బాలమ్మ మంగళవారం బస్సు వెనకచక్రం కిందపడి గాయాలపాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. బాలమ్మ గ్రామ శివారులోని తమ పొలంలో పనులు ముగించుకుని వచ్చేందుకు తాండూర్ రహదారికి వచ్చింది. రామాలయం స్టేజీ వద్ద నిలబడిన ఆమె పరిగి డిపో బస్సు ఎక్కేందుకు ప్రయత్నించగా కింద పడింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఆమె వెనక చక్రం కింద కాలు పడి తీవ్రగాయమైంది. వెంటనే ఆమెను స్థానికులు 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు

రాజాపూర్: వేరుశనగ పంటలో చీడపురుగుల నుంచి సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కల్లేపల్లి శివారులో వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: గ్రామీణ ప్రాంతాల నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, అమ్రునాయక్ తండాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల చేతిలో పెట్టి మోసపోవద్దని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన వరి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వ సన్నరకం వరిధాన్యానికి కింటాలుకు రూ.500 బోనస్ అదనంగా ఇస్తుందన్నారు. అంతకుముందు మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్లకు పోటెత్తిన వరిధాన్యం


దేవరకద్ర మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన వరిధాన్యం


జడ్చర్ల/ దేవరకద్ర: జిల్లాలోని ప్రధానమైన వ్యవసాయ మార్కెట్లలో ధాన్యం క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 5,035 క్వింటాళ్ల ధాన్యం, 2,584 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.2,409, కనిష్టంగా రూ.1,906 ధరలు లభించాయి. అలాగే హంస రకం గరిష్టంగా రూ.2,129, కనిష్టంగా రూ.1,840, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,679, కనిష్టంగా రూ.1,414, సోనమసూరి గరిష్టంగా రూ.1,911, కనిష్టంగా రూ.1,616, వేరుశనగ గరిష్టంగా రూ.6,120, కనిష్టంగా రూ.5,925, రాగులు రూ.2,500 చొప్పున పలికాయి.

- దేవరకద్ర మార్కెట్ యార్డులో జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,169, కనిష్టంగా రూ.1,919, హంస ధాన్యం గరిష్టంగా రూ.1,951, కనిష్టంగా రూ.1,889 చొప్పున ధరలు నమోదయ్యాయి. మార్కెట్‌కు దాదాపు 5 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

నేడు ఉల్లిపాయల వేలం..

దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉదయం 10 గంటలకు ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెచ్చే ఉల్లిపాయలను స్థానిక వ్యాపారులతోపాటు ఇతర మార్కెట్ వ్యాపారులు పాల్గొనే అవకాశం ఉంది. గత వారం ఉల్లి ధరలు కొంత వరకు పెరగగా ఈ వారం ధరలు వేలం తర్వాత తెలుస్తుంది.

జీఓ నం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలి


ఆర్‌ఎంఓ హరినాథ్‌కు డిమాండ్ నోటీసు అందిస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి జీఓ నం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ నం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని జడ్చర్ల ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ డా.హరినాథ్‌కు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌కి సంబంధించిన ఏరియా ఆస్పత్రి, బాలానగర్ సీహెచ్‌సీలో పనిచేస్తున్న పారిశుధ్య, భద్రత, పేషెంట్‌కేర్, సంరక్షణ నిర్వహణ చూసే వెంకటయ్య ఏజెన్సీ, శాంతి ఏజెన్సీ కాంట్రాక్టర్లు జీఓ నె.60ను ఖాతరు చేయటం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నా యకులు కృష్ణయాదవ్, ఆస్పత్రి బ్రాంచ్ నాయకులు నర్సింహ, రాజేష్, శేఖర్, వినయ్, నిర్మల, విజయలక్ష్మి, మనెమ్మ, శివలీల, పద్మ, అలివేల, స్వాతి పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలు

హన్వాడ: మండలంలోని మాదారంలో మంగళవారం సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉత్సవాలు ప్రారంభించారు. సదర్ ఉత్సవాలు యాదవుల్లో ఉత్సాహాన్ని నింపి ఐక్యత సూచిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్, అమ్మాపూర్ శ్రీనువాసులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

హన్వాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేస్తామని బీజేపీ మండల నాయకుడు రఘురాంగౌడ్ ధీమా వక్తం చేశారు. మంగళవారం టంకరలో పీఎం మత్స్యకిసాన్ సమృద్ధి సహయోజన పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

కార్తీక దీపోత్సవం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ ఎల్లమ్మ దేవాలయంలో కార్తీక మంగళవారం పురస్కరించుకుని భక్తులు దీపాలు వెలిగించారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు.